## సహకార సంఘం ఎండీపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన మాజీ ఎండీపై చర్యలు తీసుకోవాలని రైతు రుణమాఫీ సాధన సమితి సభ్యులు అన్నారు. ఈ మేరకు శనివారం నూతన ఎండీ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ జాబితా తప్పుగా ఉన్నందునే రుణమాఫీ కాలేదని, తన అక్రమాలు బయట పడతాయనే అధికారులు రైతుల తుది జాబితాను పంపలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంఘంలో జరిగిన అవనీతి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## గంగమ్మకు పూజలు



గంగమ్మ పూజలో పాల్గొన్న లక్ష్మీనారాయణ

కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయ సమీపంలోని నాటికన్ చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతుండటంతో శనివారం ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వేదపండితులు గంగపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో పసుపు, కుంకుమ, పూలు, చల్లి గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో అన్నదానం



కీసర: రాంపల్లిలోని శ్రీ మహంకాళి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం బీఆర్ఎస్ సీనియర్‌నేత కందాడి శ్రీకాంత్‌రెడ్డి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా అన్నదాత కందాడి శ్రీకాంత్‌రెడ్డిని ,ఆలయ కమిటీ చైర్మన్ భూమయ్య, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ ప్రవాహాన్ని పరిశీలించిన పోలీసులు



మూసీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

ఘట్‌కేసర్: భారీ వర్షాల కారణంగా జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీకి వరద నీటి ప్రవాహం పోటెత్తింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో మూసీ పరివాహక ప్రాంతమైన ఎదులాబాద్ కొత్తగూడెం సమీపంలోని వంతెనను ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్సై శేఖర్‌తో కలిసి శనివారం పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. మూసీ ప్రవాహం పెరిగినందున నదిలోకి ఎవరు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## అన్నదాతలకు అన్యాయం జరిగినా పట్టదా..?



రైతులకు నిమ్మరసం ఇస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అధికారుల నిర్వాహకంతో అన్నదాతలకు అన్యాయం జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రుణ మాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. గౌరీశంకర్, రమేశ్, కోటిరెడ్డి దీక్షలు చేపట్టగా కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు సంఘీభావం ప్రకటించారు.

# ఆదినుంచి వివాదాస్పదమే..

### లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎల్లంపేట్ టీపీఎస్ రాధాకృష్ణా రెడ్డి

- మూడు మున్సిపాలిటీల్లో టీపీఎస్‌గా అదనపు బాధ్యతలు
- అతడి వైఖరిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు



ఏసీబీకి చిక్కిన టీపీఎస్ రాధాకృష్ణారెడ్డి

మేడ్చల్: ఆయన ఓ సాధారణ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్. అతను చేసేది టీపీఎస్ ఉద్యోగమైనా ఆయన పనిచేసే చోట మున్సిపాలిటీ ఆయన కనుసన్నల్లో నడవాల్సిందే. ఎంతటివారైనా డోంట్‌కేర్. పైకి నీతులు చెబుతూ అడ్డంగా దండుకుంటున్నారు. ఆయనే మూడు మున్సిపాలిటీల్లో చక్రం తిప్పుతున్న రాధాకృష్ణారెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా, భూధాన్ పోచంపల్లిలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఆయన గత కొన్నేళ్లుగా మేడ్చల్ మున్సిపాలిటీ టీపీఎస్‌గా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. మేడ్చల్‌తో పాటు నూతనంగా ఏర్పడ్డ ఎల్లంపేట్ మున్సిపాలిటీలోనూ ఇన్‌చార్జ్ టీపీఎస్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మూడు మున్సిపాలిటీలకు వారంలో రెండు రోజులు కేటాయిస్తూ దందా నడిపిస్తున్నాడు.

#### ఎక్కడ ఉన్నా అంతా ఆయనే కీలకం..

రాధాకృష్ణారెడ్డి ఎక్కడ పని చేసినా మున్సిపాలిటీ అంతా ఆయన కనుసన్నల్లో నడవాల్సిందే. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌ను కేవలం అక్రమ కట్టడాలు చూసే సెక్షన్ అన్నట్లుగా మార్చిన ఆయన మిగతా పనులు పక్కన పెట్టి కేవలం అక్రమ కట్టడాలు ఎక్కడ ఉన్నాయి.. వాటి సంగతి ఎంటి ఎక్కడ తవ్వితే డబ్బులు వస్తాయి అనే విధంగా ప్రణాళికలు రూపొందించారు. తనకు నచ్చిన కొందరు మున్సిపల్ తాత్కాలిక ఉద్యోగులను వెంటేసుకుని పట్టణాలపై పట్టు సాధిస్తున్నాడు. ఒక ఫ్లోర్ అధికంగా నిర్మించినా.. నిబంధనలకు విరుద్ధంగా ఏ చిన్న పొరపాటు చేసినా సిబ్బందిని పంపి నోటీసులు ఇవ్వడం, లేదా బెదిరించి రూ. లక్షలు వసూలు చేయడం ఆయన నైజం. తనకేమీ తెలియదంటూనే రూ.5 లక్షలు డిమాండ్ చేసే స్థాయికి ఎదిగారు. ఆయన మేడ్చల్‌లో చిన్నచిన్న రోడ్డు ఆక్రమణలను తొలగించడమేగాని పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు ఉన్నా వాటి జోలికి వెళ్లలేదు.

#### కౌన్సిలర్‌లతో గొడవ..

మేడ్చల్ మున్సిపాలిటీలో పాలకవర్గం ఉన్నన్ని రోజులు టీపీఎస్‌గా ఉన్న రాధాకృష్ణారెడ్డికి కౌన్సిలర్లకు మధ్య ఎప్పుడూ గొడవలు నడిచేవి. ఈ విషయం అప్పటి మంత్రి మల్లారెడ్డి వరకు వెళ్లింది. పేదలు ఇళ్లు నిర్మించుకుంటుంటే కుంటి సాకులు చూపుతూ రూ.లక్షలు వసూలు చేస్తున్నాడని అతడిని మేడ్చల్ నుంచి తప్పించాలని పలు మార్లు కౌన్సిలర్లు పట్టుబట్టారు. ఈ విషయమై అప్పటి కమిషనర్‌తో బహిరంగగానే గొడవకు దిగారు. టీపీఎస్ అడ్డగోలుగా దోచుకుంటున్నారని పలు మార్లు ఫిర్యాదులు చేశారు.



ఎల్లంపేట్ మున్సిపల్ కార్యాలయం

#### జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు..

టీపీఎస్ డ్యూటీ సరిగా చేయడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే కనీసం స్పందించడం లేదని, వారి ఫిర్యాదుల ఆధారంగా అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని మండల సీపీఎం నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారురు. ఆయన విధులకు సరిగా రావడం లేదని ఆయన కనబడటం లేదని మేడ్చల్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

#### బాధితుల సంబరాలు..

రాధాకృష్ణారెడ్డి ఏసీబీకి చిక్కాడనే వార్త సోషల్ మీడియాలో సర్క్యులేట్ కావడంతో ఆయన బాధితులు హర్షం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. నాయకులు సంబరాలు చేసుకున్నారు.మొత్తం మీద ఓ లంచగొండి అధికారి ఏసీబీకి చిక్కడంతో మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# దసరాకా..? దీపావళికా..?

### బతుకమ్మ చీరల పంపిణీపై సందిగ్ధం ..!

- ఈ సారి మహిళా గ్రూపు సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరలు
- సరిపడా చీరలు వస్తేనే.. పంపిణీకి సై అంటున్న అధికారగణం
- గ్రేటర్‌సహా మేడ్చల్ జిల్లాలో
- బతుకమ్మ చీరల పంపిణీ లక్ష్యం 4.92 లక్షలు
- గడువు దగ్గరపడుతున్నా... పూర్తి స్థాయిలో గోదాముల్లోకి చేరని చీరలు
- దీపావళి వరకైనా పంపిణీ చేసేలా చర్యలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: సద్దుల బతుకమ్మకు కొత్త చీరలు కట్టుకుని పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా 'రేవంతన్న కానుక' పేరిట మహిళా గ్రూపు సభ్యులకు అందజేయనున్న చేనేత చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. బతుకమ్మ పండుగకు మహిళా సంఘాల సభ్యులందరికీ చీరలు పంపిణీ చేసేందుకు ముందుగా నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా శనివారం వరకు చీరలు గోదాముల్లోకి చేరకపోవటంతో...ఏమి చేయాలో అర్థంకాక సంబంధిత అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ సహా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ముందుగా నిర్ణయించిన ప్రకారం 4.92 లక్షల బతుకమ్మ చీరలు దిగుమతి కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు సరిపడా బతుకమ్మ చీరలు గోదాముల్లోకి చేరలేదని సంబంధిత అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకోవటం మినహా గత్యంతరం లేని పరిస్థితితో కొట్టుమిట్టాడుతున్నారు. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో మహిళా గ్రూపుల సభ్యులకు ఒకటి చొప్పున 1,74,664 బతుకమ్మ చీరలు అవసరం కాగా, ఇప్పటి వరకు గోదాముల్లోకి చేరిన బతుకమ్మ చీరలు 60 వేలు మాత్రమే ఉన్నాయి. ఇదే పరిస్థితి గ్రేటర్ హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి జిల్లాలోనూ నెలకొని ఉంది. ముందుగా నిర్ణయించినట్లుగా లక్ష్యానికి అనుగుణంగా చేనేత చీరలు నిర్దేశించిన గోదాముల్లోకి చేరినట్లయితే ...ఈ నెల 24 నుంచి బతుకమ్మ చీరలను మహిళా గ్రూపు సభ్యులకు ఒక్కో చీర చొప్పున పంపిణీ చేయాలని భావించారు. వాస్తవంగా ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో మహిళా గ్రూపు సభ్యులకు రెండేసి చీరల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే దసరా లోగా ఒక్కో చీర అయినా పంపిణీ చేయాలని భావించినా, చేనేత చీరలు సకాలంలో అందని పరిస్థితి నెలకొందని ఓ జిల్లా స్థాయి అధికారి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులో సభ్యులైన ప్రతి మహిళకు ఒక చీర పంపిణీ చేయగా, ప్రస్తుత సర్కారు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులందరికీ బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. అయితే సర్కారు బతుకమ్మ చీరలను పండుగ ముగిసిన తర్వాత దీపావళి పండుగను పురస్కరించుకుని పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధర్యంలో శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ జ్యోతి ప్రజ్వలన చేసి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి టి.ఝాన్సీరాణి , జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి యం.సాంబశివరావు,ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి బాబు మోజెస్, కలెక్టరేట్ ఏఓఎల్.రామ్మోహన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజ, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో..



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో..

### కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

కీసర: స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకర్త కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో..

# ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



భవానీ దేవిగా.. గడిమైసమ్మ



శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా



ఎన్ఎఫ్‌సీనగర్‌లో..

మేడ్చల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారు భవానీ దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవీ అలంకారంలో దర్శనమిచ్చారు.



రాంపల్లి మహంకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



పూడూర్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హర్షణీయం

కుషాయిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని హర్షిస్తు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నిర్ణయంతో బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుగౌడ్, గోపాల్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

## మేడ్చల్ ఏటీసీని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం



మేడ్చల్: మేడ్చల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏటీసీని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తూ టాటా సహకారంతో ఏటీసీలుగా రూపొందించింది. వాటిని సీఎం శనివారం హైదారాబాద్‌లో ప్రారంభించారు. మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా స్థానిక అధికారులతో కలిసి సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఏటీసీలో ట్రేడ్‌లను పరిశీలించి మిషనరీల పనితీరు, ఉపాధి అవకాశాలు, వంటి వివరాలను బోధన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమ నాయక్, బీ–గేట్ వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డి, కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ భూపాల్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



శామీర్‌పేట ఐటీఐ కళాశాలలో జిల్లా కలెక్టర్ మనూ చౌదరి తదితరులు

శామీర్‌పేట్: విద్యార్థులకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ( ఏటీసీ) ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేటలోని ఐటీఐ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసేందుకు ఐటీఐలను పునరుద్ధరించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆలోచించి ఆవిష్కరణలను రూపొందించాలని సూచించారు. మీ లోని భయాన్ని విడిచి నలుగురిలో మాట్లాడేలా మిమ్మల్ని మీరు తీర్చి దిద్దుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ధైర్యంగా ఇంటర్వ్యూల్లో సమాధానం ఇవ్వగలుగుతారని సూచించారు. విద్యార్థులకు థియరీ నాలెడ్జ్ ఉంటుంది తప్ప ప్రాక్టికల్ నాలెడ్జ్ లేనందున ఉద్యోగాలు రావడం లేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. థియరీ తోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఏదో ఉద్యోగం కోసం కాకుండా పది మందికి ఉపాధి కల్పించే దిశగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అప్పల రాజు మృతదేహం

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆకుల అప్పలరాజు (54) అనే వ్యక్తి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సంజన అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం అతను తన కుమారుడు గణేష్‌తో కలిసి కండ్లకోయ నుంచి మేడ్చల్ వైపు బైక్‌పై వస్తున్నాడు. పిస్తా హౌజ్ హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో అప్పల రాజు అక్కడికక్కడే మృతి చెందగా, గణేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గణేశ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరఫున వైద్య ఆరోగ్య, సహకార, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో మహిళా అధికారులు, ఉద్యోగులు బతుకమ్మ ఆట ఆడారు. ఈ సందర్భంగా డీఆర్ఓ హరిప్రియ మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతి పండుగని, ప్రకృతిలో దొరికే గునుగు , తంగేడు పూలు , రుద్రాక్షాలు, బంతి, చామంతి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి అవే పూలను నీటిలో వేసే పండుగన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ ఉమాగౌరి, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత, సాంస్కృతిక కళాకారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## వాడవాడలా బతుకమ్మ వేడుకలు

మేడ్చల్ జిల్లాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కాలనీల్లో మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడి పాడి సందడి చేశారు.

–మేడ్చల్ జోన్ బృందం



కేజీఆర్ కళాశాలలో..



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో..



ఎస్ఎన్ఆర్‌జీలో..



ఘట్‌కేసర్‌లో...



మేడ్చల్ పట్టణంలో..